# అ'ధర్మ'తేజం

ఈసారి ఫైనాన్షియల్ క్రైమ్స్ గురించి రాస్తాను. వేరే ఎవరితోనో ఎందుకు మన తెలుగువాళ్లతోనే మొదలు పెట్టవచ్చు కదా అనిపించి, 20 వ శతాబ్దం ఆరవ దశకం మధ్యలో స్కామ్ చేసి చరిత్రలో మిగిలిన జయంతి ధర్మతేజ గురించి రాస్తున్నాను.

చాలామంది వ్యాపారస్తులు మొదట కష్టపడే పైకి వస్తారు. కంపెనీ పెద్దది కాగానే కంపెనీ డబ్బును తన స్వంత ఖాతాలకు మళ్లిస్తారు. ఇలాటివాళ్లకు గొప్ప నేపథ్యం వుంటుంది. అమోఘమైన తెలివితేటలుంటాయి. దేశాధినేతలు సైతం వాళ్లను చూసి మురిసి ముగ్ధులైపోతారు. స్వదేశంలో వాళ్లకు రెడ్ కార్పెట్ పరుస్తారు. వీళ్లు దేశానికి ప్రపంచంలోనే ఓ గుర్తింపు తెస్తారు. హై ఫ్లయింగ్‌గా వుంటారు. అంతలోనే ఓ దుర్మూహూర్తాన వీళ్లు కంపెనీ నుండి యింటికి డబ్బు తరలిస్తున్నారని బయటపడుతుంది. జైలుపాలవుతారు. వాళ్లు చేసిన మంచికి మెచ్చుకోవాలో, చెడు పనులకు తిట్టుకోవాలో తెలియని సందిగ్ధంలో పడతారు ప్రజలు. గతంలో వాళ్ల చేత ఫేవర్స్ పొందిన నాయకులు కిమ్మనరు. వాళ్లు దేశానికి తెచ్చిన ఖ్యాతిని దృష్టిలో పెట్టుకుని క్షమించవచ్చు కదా అని కొందరు ఫీలవుతూన్న అధికారులు కాస్త చూసీ చూడనట్టుగా వదిలేస్తారు.

ఇవన్నీ చెప్పగానే ఇప్పటి జనాలకు సత్యం రామలింగరాజు గుర్తుకు రావచ్చు. కానీ నేను చెప్పబోయే జయంతి ధర్మతేజ 1970లోనే యివన్నీ చేశారు. ఆయనకూ రామలింగరాజుకు ఓ పోలిక కూడా వుంది. ఇద్దరూ జైల్లో వుండగా కవిత్వం రాశారు. రామలింగరాజు తెలుగులో రాస్తే, ధర్మతేజ ఇంగ్లీషులో రాశారు. (అన్నట్టు రామలింగరాజు కుమారుడి పేరు తేజ!) ధర్మతేజ జైల్లో వుండగా ఇంగ్లీషులో కవిత్వం రాయడమే కాదు, పార్టికల్ ఫిజిక్స్ మీద నాలుగు పేపర్లు రాశారు. ఎందుకంటే ఆయన న్యూక్లియార్ ఫిజిక్స్‌లో రిసెర్చి చేసి వున్నారు. పైగా సంగీతజ్ఞుడు. పైగా జయంతి షిప్పింగ్ కంపెనీ పేర ప్రపంచ సముద్రతీరాలపై ఇండియన్ నౌకలను నడిపి మన భారతపతాకను నలుదిశలా ఎగరేసిన ద్రష్ట. మరి యింత గొప్పవాడైతే జైల్లో ఎందుకు వున్నాడయ్యా అంటే కంపెనీ డబ్బును దుర్వినియోగం చేశాడు కాబట్టి. తను చైర్మన్‌గా వున్న షిప్పింగ్ కంపెనీకి డాక్యుమెంట్లను తారుమారు చేశాడు. భారతదేశాన్నే కాదు, జపాన్‌ను మోసం చేశాడు.

ధర్మతేజది బరంపురం. ప్రస్తుతం ఒడిశాలో వున్నా అప్పట్లో తెలుగువాళ్లు పుష్కలంగా వున్న తెలుగు ప్రాంతమే. తెలుగు సనాతన సంప్రదాయం గల కుటుంబంలో 1922లో పుట్టాడు ధర్మతేజ. వాళ్ల తలిదండ్రులిద్దరూ స్వాతంత్ర్యయోధులే. వాళ్ల అమ్మగారు స్వాతంత్ర్యపోరాటంలో దక్షిణభారతంలో జైలుకెళ్లిన తొలి మహిళ. వాళ్ల నాన్నగారు సంస్కరణవాది. బ్రహ్మసమాజ మతావలంబి. వాళ్ల యింటికి ఆనాటి ప్రముఖ స్వాతంత్ర్యయోధులందరూ వచ్చేవారు. ఆ విధంగా ధర్మతేజ గాంధీ, నెహ్రూ, బోస్, జయప్రకాష్ నారాయణ్ యిత్యాదులను తన యింట్లోనే కలిశాడు.

ఇక చదువులో కూడా ధర్మతేజ టాప్. సైన్సులో పట్టా తీసుకుని రిసెర్చి చేస్తూ షికాగోలోని విశ్వవిఖ్యాత ఫెర్ని ఇన్‌స్టిట్యూట్‌లో సాక్షాత్తూ ఫెర్ని వద్దనే న్యూక్లియార్ ఫిజిక్స్‌లో రిసెర్చి చేయడం మొదలుపెట్టాడు. అంతలోనే అకడమిక్‌గా చదువు కట్టిపెట్టి ఉద్యోగంలో చేరాడు. అమెరికాలో మేగ్నటిక్ టేప్స్ తయారుచేసే కంపెనీలో చేరి అతి త్వరలో వైస్ ప్రెసిడెంటు అయ్యాడు. దాని టర్నోవర్ మూడురెట్లు చేసి తన సత్తా చాటుకుని స్వంతంగా వ్యాపారంలోకి దిగాడు. కొంతమందితో చేతులు కలిపి, అమెరికాలో అనేక నగరాలలో రిసెర్చి లాబ్స్ నెలకొల్పాడు.



1960 వచ్చేనాటికి ఆయన చాలా ధనికుడైన ఎన్నారై. అమెరికాలో, యూరోప్‌లో చాలా యిళ్లున్నాయి. రెండు ఓడలున్నాయి. పశ్చిమ యూరోప్‌లో ఓ స్టీల్ ఫ్యాక్టరీ పెట్టి దానికి భారతదేశం నుండి ఇనుపఖనిజం తీసుకెళ్లే యోచనలో వున్నాడు. అయితే ఆ ఖనిజాన్ని తీసుకెళ్లాలంటే ఓడ డిజైన్‌లో మార్పు చేయించాలి. దాన్ని అధ్యయనం చేయడానికి తన అమెరికన్ భార్య బెట్సీతో కలిసి ఆయన భారతదేశానికి వచ్చాడు. అప్పుడు అనేకమంది రాజకీయనాయకులు ఆయన చుట్టూ మూగి మనదేశంలో పెట్టుబడి పెట్టకూడదా అంటూ అడిగారు. నెహ్రూని కూడా కలిపించారు. నెహ్రూతో మాట్లాడాక ధర్మతేజ భారతదేశపు షిప్పింగ్ పరిశ్రమను ఎలా అభివృద్ధి చేయవచ్చో ఒక బ్లూప్రింట్ తయారుచేసి యిచ్చాడు.

అది చూసి ముచ్చట పడిన నెహ్రూ కాబినెట్ మీటింగులో ధర్మతేజ ప్లాను గురించి చెప్పి - 'అతనికి ఏదో కాస్త యివ్వండి' (థోడా కుఛ్ దే దో) అన్నాడు. ఆ 'కుఛ్' 20 కోట్ల రూ.ల ప్రభుత్వ ఋణంగా తేలింది చివరకు. ధర్మతేజ చైర్మన్‌గా 75% వాటాలతో జయంతి

షిప్పింగ్ కంపెనీ అని పెట్టి జపాన్ నుండి ఓడలు కొన్నాడు. నెహ్రూ కాబినెట్‌లో ఫైనాన్స్ మంత్రిగా వున్న మొరార్జీ దేశాయ్‌కు కూడా ధర్మతేజ చాలా నచ్చాడు. 1961లో మొదటి నౌక సముద్రప్రవేశం మొరార్జీ చేతులమీదుగా జరిగింది. జయంతి షిప్పింగ్ కంపెనీ ఎదుగుదల చరిత్ర సృష్టించింది. అతి కొద్దికాలంలోనే ప్రభుత్వ ఋణం చేతికి వచ్చేలోపునే కోటిన్నర డాలర్ల అంతర్జాతీయ ఋణం సంపాదించింది.

జపాన్‌లోని నౌకా నిర్మాణ సంస్థలు హామీ పత్రాల ఆధారంగా ఓడలు సప్లయి చేశారు. వాళ్లకి మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ మాత్రం కట్టి ఓడల డెలివరీ తీసుకున్నాడు ధర్మతేజ. వాటిని యితర దేశాల కంపెనీలకు కుదువ పెట్టి ఆ డబ్బుతో కొత్త నౌకలకు మొదటి యిన్‌స్టాల్‌మెంట్లు కట్టాడు. భారత నౌకారంగం ఎరుగని రీతిలో బల్క్ కారియర్లు, టాంకర్లు ప్రవేశపెట్టాడు ధర్మతేజ. అప్పటివరకు అంతర్జాతీయ నౌకా సంస్థలకు మాత్రమే అవి వుండేవి. ధర్మతేజ స్టయిల్ చూసి అప్పులు సులభంగా పుట్టాయి. అన్ని దేశాల అధిపతులు అతన్ని మన్నించేవారు, గౌరవించేవారు. అతని వ్యక్తిగత జీవితంలో కూడా మార్పులు వచ్చాయి. మొదటి భార్యను వదిలేసి, తనకు సెక్రటరీగా పనిచేస్తున్న రంజిత్‌ను రెండవ భార్యగా చేసుకున్నాడు.

1966 నాటికి భారత నౌకారంగంలో జయంతి షిప్పింగ్ 22 నౌకలతో అతి పెద్ద నౌకాసంస్థగా అవతరించింది. నెహ్రూ ఆశీస్సులున్న యీ కంపెనీ ఎదుగుదల ప్రతిపక్షాల వారికి కన్నెర్ర అయింది. సోషలిస్టు నాయకుడు రామ్ మనోహర్ లోహియా పార్లమెంటులో, బయటా దీనిపై విమర్శలు గుప్పించారు. నెహ్రూ 1964లో మరణించాక విమర్శలు మరీ పెరిగాయి. మిట్సుబిషీ హెవీ ఇండస్ట్రీస్‌తో ధర్మతేజకు అండర్ హ్యాండ్ డీలింగ్స్ వున్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. రామ్ మనోహర్ లోహియా ధర్మతేజను అడ్డుపెట్టుకుని నెహ్రూ కుటుంబంపై దాడి చేశాడు. ఇందిరా గాంధీ పిల్లలు రాజీవ్, సంజయ్‌లు ఇంగ్లండులో వుండగా వారి చదువుల ఖర్చే కాకుండా, ఫ్రాన్సులో వారి హాలీడేయింగ్ ఖర్చు (ధర్మతేజకు ఫ్రాన్స్‌లో యిల్లుంది) కూడా ధర్మతేజాయే భరించాడని, ఇందిరా గాంధీకి చాలా ఖరీదైన మింక్ కోట్ బహూకరించాడని ఆరోపించాడు (చంద్రబాబు కుమారుడి చదువు ఖర్చు సత్యం రామలింగరాజు భరించారని ఆరోపణలు వచ్చాయి). ఇందిరా గాంధీ 1966లో ప్రధానమంత్రి అయ్యాక విమర్శలు మరింత పెరగడంతో ఆమె ఆ కంపెనీ వ్యవహారాలపై విచారణకు ఆదేశించింది.

ఇక సిబిఐ రంగంలోకి దిగి పరిశోధన మొదలుపెట్టింది. భారత్, ఇంగ్లండు, అమెరికా, నార్వే, జపాన్, బహామాస్‌లో కంపెనీ కార్యకలాపాలు సమీక్షించి నాలుగు ఆరోపణలు తయారుచేసింది. మొదటిది – కంపెనీ పేర వున్న 12 లక్షల డాలర్ల ఎల్.సి. (లెటర్ ఆఫ్ క్రెడిట్)ను ధర్మతేజ పేర బదిలీ చేస్తూ కంపెనీ డైరక్టర్లు చేసిన తీర్మానం నకిలీది. దాన్ని ధర్మతేజ, అతని భార్య రంజిత్ కలిసి ఫోర్జ్ చేశారు. రెండో ఆరోపణ – తన మొదటి భార్యకు స్టేటు బ్యాంక్ ఆఫ్ ఇండియా లండన్ బ్రాంచ్‌లో వున్న 1.37 లక్షల డాలర్ల బాలన్సును తప్పుడు డాక్యుమెంట్లతో విత్‌డ్రా చేశాడు. మూడో ఆరోపణ – ఒక నౌకను అద్దెకు తీసుకున్న నార్వేజియన్ కంపెనీ చెల్లించిన 87 వేల డాలర్లను తన ఎక్కవుంటులో వేసుకున్నాడు. నాల్గో ఆరోపణ – కంపెనీ తరఫున మిట్సుబిషీ కార్పోరేషన్ నుండి 11 నౌకలు కొన్నప్పుడు 2% కమిషన్ తీసుకుని తన ఖాతాలో వేసుకున్నాడు.

ఇవి బయటకు రాగానే జయంతి షిప్పింగ్ కంపెనీని జాతీయం చేయాలనీ, ధర్మతేజను అరెస్టు చేయాలనీ ప్రతిపక్షాలు ఆందోళన మొదలుపెట్టాయి. ప్రభుత్వ కంపెనీ ఐన షిప్పింగ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా తన కంపెనీని స్వాధీనం చేసుకున్న వార్త ఫ్రాన్సులో వున్న ధర్మతేజకు చేరడంతో ఆయన తన భార్య రంజిత్‌తో కలిసి అక్కణ్నుంచే అమెరికాకు పారిపోయాడు. భారతప్రభుత్వం కోరికపై న్యూయార్క్ పోలీసులు అతన్ని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. లక్ష రూపాయలకు బెయిల్ తీసుకుని, బెయిల్ జంప్ చేసి, దక్షిణ అమెరికాలోని కోస్టారికాకు పారిపోయాడు. కోస్టారికా అధ్యక్షుడు జోస్ ఫిగెరాస్ ధర్మతేజకు మిత్రుడు. ఈలోగా జపాన్ కంపెనీ తన ఓడలను స్వాధీనం చేసుకుందామని ప్రయత్నించి, అవి తాకట్టులో వున్న విషయం గ్రహించింది. ధర్మతేజ హంగామా అంతా ఎండమావి వంటిదే అని తేలింది.

ఈ లోగా ధర్మతేజ కోస్టారికా ప్రభుత్వానికి ఆర్థిక సలహాదారుగా పనిచేశాడు. ఆ ప్రభుత్వం అతనికి పూర్తి రక్షణ కల్పించింది. అతన్ని తమకు అప్పగించాలని భారత ప్రభుత్వం కోస్టారికా సుప్రీంకోర్టులో కేసు వేస్తే ధర్మతేజ తరఫున ఆ ప్రభుత్వపు హోం శాఖ వాదించి గెలిచింది. అందువలన భారత ప్రభుత్వం ఏమీ చేయలేకపోయింది. కోస్టారికా ప్రభుత్వం ధర్మతేజను రాయబారిగా గుర్తించడంతో డిప్లొమాట్స్ కుండే యిమ్యూనిటీ (రక్షణ)యే కవచంగా ధర్మతేజ అమెరికాకు యితర దేశాలకు వెళ్లి వస్తూ వుండేవాడు. ఇలా మూడేళ్లు గడిచాక 1970లో స్విట్జర్లండ్ వెళ్లడానికి హీత్రూ ఎయిర్‌పోర్టులో వుండగా స్కాట్లండ్ యార్డ్ వాళ్లు అరెస్టు చేశారు. ఇంగ్లండు కోర్టులో



భారతప్రభుత్వం కేసు వేసింది. ఈ సారి ధర్మతేజ తరఫున వాదించినవాడు దరిమిలా లేబర్ ప్రధానమంత్రిగా పనిచేసిన మైకేల్ ఫుట్ సోదరుడు లార్డ్ డింగిల్ ఫుట్. అతను ధర్మతేజ భారతదేశానికి ఎంతో సేవ చేశాడని, నెహ్రూకి డిగోల్‌కి మధ్య సమావేశం ఏర్పాటు చేశాడని, అతనిలాటి వాణ్ని శిక్షించకూడదని వాదించాడు. అంత పెద్దవాడు వాదించినా ధర్మతేజ కేసు ఓడిపోయాడు.

భారతప్రభుత్వం కేసు నెగ్గి ధర్మతేజను అరెస్టు చేసి ఢిల్లీలో సెషన్స్ కోర్టులో విచారణ జరిపారు. ఏడాదిపాటు వాదప్రతివాదనలు జరిగాక 1972లో అతనికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, 14.13 లక్షల రూ.ల జరిమానా విధించారు. ధర్మతేజను హైదరాబాదులోని జైలుకి తరలించి నాలుగేళ్ల ఏడు నెలలపాటు వుంచారు. అక్కడే పైన చెప్పినట్టు కవిత్వం, ఫిజిక్స్ పేపర్లు రాశాడాయన. 1975 ఫిబ్రవరిలో జైలునుండి బయటకు వచ్చాడు కానీ కష్టాలగాథ ముగియలేదు. జయంతి షిప్పింగ్ కంపెనీని జాతీయం చేసినపుడు ధర్మతేజకు ప్రభుత్వం 3.75 కోట్ల రూ.లు యిచ్చింది. పన్ను బకాయిలంటూ ఇన్‌కమ్‌టాక్స్ డిపార్టుమెంటు ఆ డబ్బు తీసేసుకుంది. పైగా 4.80 కోట్లు యింకా రావాలంది. మీరు ఆ డబ్బు తీసేసుకున్నారు కాబట్టి నేను టాక్సు కట్టనక్కరలేదంటాడు ధర్మతేజ.

ఈ వాదోపవాదాలు జరుగుతూండగానే 1977 మేలో అతను పాస్‌పోర్టు సంపాదించుకున్నాడు. విదేశాలకు పారిపోయాడు. ఇన్‌కమ్‌టాక్స్ డిపార్టుమెంటు నో అబ్జక్షన్ సర్టిఫికెట్టు యివ్వకుండా పాస్‌పోర్టు ఎలా జారీ అయిందని అందరూ అడిగారు. అతన్ని విదేశాలకు తీసుకెళ్లిన పేనామ్ ఎయిర్‌లైన్సు వారిని నిలదీస్తే అత్యున్నత స్థాయినుండి సిఫార్సు వచ్చిందని అన్నారు. అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయితో సహా అనేకమంది రాజకీయనేతలకు ధర్మతేజపై జాలి వుంది. "అతను దేశం నుండి తీసుకున్నదాని కంటె యిచ్చినదే ఎక్కువ. అతను పాపం చేశాడు కానీ అంతకంటె ఎక్కువగా అతనిపట్ల అన్యాయం జరిగింది." అన్నారట మొరార్జీ.

ఐదేళ్లు విదేశాలలో వున్నాక ధర్మతేజ కర్మకాలి 1983 ఫిబ్రవరిలో ఇండియా వచ్చాడు. ఇన్‌కమ్‌టాక్స్ వారి లెక్క ప్రకారం అప్పటి 4.80 కోట్ల బకాయిలు యిప్పుడు 13.53 కోట్లు అయ్యాయి. అప్పటికి అత్యధిక స్థాయిలో ఇన్‌కమ్‌టాక్స్ ఎగ్గొట్టిన వ్యక్తులలో ఆయనది రెండో స్థానం. ధర్మతేజ లెక్క ప్రకారం తన కంపెనీకి యిచ్చిన కాంపెన్సేషన్ చాలా తక్కువ. అది సవ్యంగా యిచ్చి ఇన్‌కమ్‌టాక్స్‌కి అడ్జస్టు చేసి వుంటే తనేమీ బకాయి లేదు. ఇన్‌కమ్‌టాక్సు వాళ్లు అడుగుతూనే వున్నారు కానీ ధర్మతేజ దేశంలో స్వేచ్ఛగా తిరిగాడు. అతను ఒక వెలుగు వెలిగినప్పుడు ఎంతమంది నాయకులకు సాయం చేశాడో ఏమో ప్రభుత్వంలో పెద్దలందరితో భుజాలు రాసుకుని తిరిగాడు. ఎన్నికలలో కూడా పోటీ చేశాడు. చివరకు 1985 క్రిస్‌మస్ నాడు మరణించాడు.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2011)**

ఫోటోలు – 1. కోర్టులో దోషిగా ధర్మతేజ, 2.ధర్మతేజ, అతని రెండో భార్య రంజిత్‌తో..